ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు..
మంచిర్యాల డీసీపీ ఎగ్గడి బాస్కర్
కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం.. 7

ఒక్క చాన్స్ ప్లీజ్
నేతల చుట్టూ ఆశావాహుల ప్రదక్షిణలు
గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయం 7

మాతృశక్తి సత్సంగ్ సమావేశం


నస్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం రిటైర్మెంట్ కాలనీలో విశ్వ హిందూ పరిషత్ మాతృశక్తి సత్సంగ్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాతృశక్తి ప్రాంత సహ సంయోజిక శ్రీవాణి మాట్లాడుతూ మహిళలు ప్రాశ్చాత సంస్కృతి పోకడలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో పరిషత్ జిల్లా ఉపాధ్యాక్షురాలు గొట్టిపర్తి కనకతార, జిల్లా కార్యదర్శి వేముల రమేష్, అధ్యక్షుడు మొగిలయ్య, నగర కార్యదర్శి ఇరుకుల రాజేశం, ఉపాధ్యాక్షులు విద్యాసాగర్, సంపత్, కోశాధికారి విష్ణు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దీక్షా దివస్

నస్పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ సీఎం కేసీఆర్ ధృఢ సంకల్పంతో ఆనాడు ఆమరణ దీక్ష చేసి కేంద్రంతో కొట్లాడి తెలంగాణ సాధించారని, ఆయన చేసిన దీక్ష రోజు దీక్షా దివస్ నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా వక్తలు వెల్లడించారు. దీక్షా దివస్ చరిత్రను మలుపు తిప్పి తెలంగాణ సమాజాన్ని కదిలించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ దీక్షా దివస్ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు సుమన్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలతో పాటు జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబరు 2న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో దివ్యాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల లోపు బాల బాలికలకు, 18 నుంచి 54 ఏళ్ల మహిళలు, పురుషులకు వేరు వేరుగా పోటీలు ఉంటాయన్నారు. ఉదయం 9 గంటలకు ఆధార్‌కార్డు, సదరం లేదా యుడీఐడీ కార్డులతో రావాలన్నారు.



- 800 మంది సిబ్బందితో పటిష్ట ఏర్పాట్లు
- ఎంసీసీని పకడ్బందీగా అమలు చేసే చర్యలు
- ప్రత్యేక బలగాలతో విస్తృత తనిఖీలు
- ఐదు చెక్ పోస్టులతో జిల్లా కట్టుదిట్టం

నిఘా నీడలో పంచాయతీ పోరు

మంచిర్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను పూర్తిగా నిఘా నీడలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ రంగం సిద్ధం చేసింది. స్థానిక పోలీసులకు అదనంగా ప్రత్యేక బలగాలతో విస్తృత తనిఖీలు నిర్వహించడం ద్వారా నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేక పోలీసు బృందాలు ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలపై నిఘా వేసి, తనిఖీలు ముమ్మరం చేశాయి. జిల్లాలోని 306 గ్రామ పంచాయతీలకుగాను 83 జీపీలను పోలీస్‌శాఖ అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించింది. ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తుండగా, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాట్లను కూడా పకడ్బందీగా చేపట్టనున్నారు.

ఐదు చెక్ పోస్టుల ఏర్పాటు....

ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రవాహాన్ని అరికట్టేందుకు పోలీస్‌శాఖ పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా జిల్లా సరిహద్దుల ద్వారా జిల్లాలోకి, అలాగే జిల్లా నుంచి ఇతర జిల్లాలకు నగదు, మద్యం, దేశీ దారు, గుడుంబా, ఉచిత ప్రలోభాలకు సంబంధించిన వస్తువులు తరలిపోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో ఐదు చెక్ పోస్టులను ఏర్పాటు చేసింది. వీటిలో ఒక అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ ఉండగా, మరో ఐదు అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఉన్నాయి. కోటపల్లి మండలం నుంచి ప్రాణహిత నది మీదుగా మహారాష్ట్రకు రోడ్డు మార్గంలో రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడంతో మండలంలోని పారుపెల్లి వద్ద అంతర్ రాష్ట్ర చెక్ పోస్టును ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. అలాగే జైపూర్ మండలం ఇందారం, తాండూరు మండలం రెబ్బెనపల్లి, దండేపల్లి మండలం గూడెం, జన్నారం మండలం ఇందన్‌పల్లి వద్ద అంతర్ జిల్లా చెక్ పోస్టులు..

మిగతా 7వ పేజీలో


గూడెం అంతర్ జిల్లా చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు...

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్



పంచాయతీ ఎన్నికలను కట్టదిట్టమైన భద్రతా చర్యల మధ్య పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు ప్రచారంలో భాగంగా ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలు చేపట్టరాదు. మద్యం పంపిణీ, బహుమతుల సరఫరా లాంటి పనులకు పాల్పడితే చట్టపర మైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది లాంటివి. ప్రతి ఒక్కరూ ఓటు వేయడం ద్వారా వందశాతం ఓటింగ్ జరిగేటట్లు చూడాలి. ఓటర్లు నిర్భయంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి.

'స్వచ్ఛ ఏవం' హరిత కార్యక్రమానికి పాఠశాలల ఎంపిక

మంచిర్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకం స్వచ్ఛ ఏవం హరిత కార్యక్రమం కింద జిల్లాలోని ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేశారు. స్వచ్ఛ ఎవం హరిత విద్యాలయాల రేటింగ్-2025 ఎంపికలో భాగంగా రాష్ట్రస్థాయికి పాఠశాలలను ఎంపిక చేశారు. పట్టణ ప్రాంతం నుంచి 2, గ్రామీణ ప్రాంతం నుంచి 6 పాఠశాలలు పథకం కింద ఎంపిక అయ్యాయి. అర్బన్ కేటగిరీ 1లో కళ్యాణిఖనిలోని సింగరేణి కాలరీస్ పబ్లిక్ స్కూల్, కేటగిరీ 2 లో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం, రూరల్ కేటగిరీ 1లో జైపూర్ మండలం రసూల్‌పల్లి ఎంపీపీఎస్, బెల్లంపల్లి మండలంలోని మాల గురిజాల ఎంపీపీఎస్, జన్నారం మండలంలోని స్లేట్ స్కూల్, కేటగిరీ 2లో జైపూర్ మండలం ఇందారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జన్నారం మండలం కిష్టాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేమనపల్లి మండలం నీల్వాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఎంపిక కాగా, డీఈవో యాదయ్య వివరాలు వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన పాఠశాలల్లో 14 స్కూళ్లు జాతీయ స్థాయికి చేరుకుంటాయని తెలిపారు.

ఆత్మ చైర్మన్‌కు సన్మానం


శ్రీరామరావును సన్మానిస్తున్న షోరూం నిర్వహకులు,సిబ్బంది

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సిర్పూర్ నియోజకవర్గ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ చైర్మన్‌గా ఎన్నికైన తాళ్లపల్లి శ్రీరామరావును శనివారం మంచిర్యాలలో శ్రీ రాజరాజేశ్వరి ట్రాక్టర్‌షోరూమ్‌లో షోరూమ్ నిర్వహకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు, మంచిర్యాలకు సంబంధించిన పలు అంశాలపై కలిసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ యాజమాని పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మందమర్రిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అను అనే విద్యార్థిని నల్గొండలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17 ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిందని ప్రిన్సిపల్ సారా తస్నీం శనివారం తెలిపారు. త్వరలో జార్ఖండ్‌లో డిసెంబరు 17 నుంచి 19 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

ముగిసిన మొదటి విడత నామినేషన్ల పర్వం..

- చివరి రోజు అభ్యర్థుల నుంచి భారీ స్పందన
- సమయం ముగిసే సరికి క్యూలో ఉన్నవారికి టోకెన్లు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన నామినేషన్ ప్రక్రియ
- మొదటి విడుతలో వరదలా దాఖలైన నామినేషన్లు

మంచిర్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడుత నామినేషన్ల పర్వం శనివారంతో ముగిసింది. మొదటి విడుతలో మంచిర్యాల నియోజక వర్గంలోని దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాలతోపాటు నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజక వర్గం పరిధికి సంబంధించి జిల్లాలోని జన్నారం మండలంలో ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా మండలాల్లోని మొత్తం 90 గ్రామ పంచాయతీలు, 816 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించనుండగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. తొలి రెండు రోజుల్లో ఆయా మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 124, వార్డు మెంబర్ స్థానాలకు 136 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఊహించని రీతిలో అభ్యర్థులు తరలివచ్చారు. నాలుగు మండలాల్లో నిర్ణీత సమయం సాయంత్రం ఐదు గంటల వరకు కూడా నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తికాలేదు. దీంతో అప్పటి వరకు క్యూలో ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసిన ఎన్నికల అధికారులు అర్ధరాత్రి వరకు వారితో నామినేషన్లు దాఖలు చేయించారు. రాత్రి 12 గంటల వరకు కూడా ఏ మండలంలో ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయో స్పష్టం కాలేదు. ఈ కారణంగా చివరి రోజు దాఖలైన నామినేషన్ల సంఖ్యను ఆదివారం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. మొదటి విడుత నామినేషన్లు ముగియడంతో ఈ నెల 30న వాటి పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా విడుదల, డిసెంబరు 1న అప్పీళ్లకు గడువు, 2న అప్పీళ్ల పరిష్కరణ, 3న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 11న ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతల ప్రకటనతోపాటు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహణ చేపట్టనున్నారు.

నేటి నుంచి రెండో విడుత ప్రారంభం...

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం నుంచి రెండో విడుత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. రెండో విడుతలో బెల్లంపల్లి నియోజక వర్గంలోని బెల్లంపల్లి, భీమిని, కన్నెపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూరు, వేమనపల్లి మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆయా మండలాల పరిధిలో 114 సర్పంచ్ స్థానాలు, 996 వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 30న నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కానుండగా, అదే రోజు ఓటర్ల జాబితా ప్రదర్శన చేపడతారు. డిసెంబరు 2న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ, 3న నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా విడుదల, 4న అప్పీళ్లకు గడువు, 5న అప్పీళ్ల పరిష్కరణ, 6న నామినేషన్ల ఉపసంహరణ గడువు, అభ్యర్థుల తుది జాబితా విడుదల, 14న ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతల ప్రకటనతోపాటు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహణ చేపట్టనున్నారు.

హాజీపూర్ : చివరి రోజైన శనివారం భారీ సంఖ్యలో ఆశావాహులు నామినేషన్ కేంద్రాల వద్ద బారులు దీరారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో ఎస్సై స్వరూప్ రాజ్ పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. మండలంలో నామినేషన్ల కోసం హాజీపూర్, కర్ణమామిడి, దొనబండ, గఢ్పూర్ లలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. హాజీపూర్ క్లస్టర్‌లో నామినేషన్ కేంద్రం కిక్కిరిసిపోయింది. రాష్ట్ర పరిశీలకులు మనోహర్, వ్యయ నిర్వహణ పరిశీలకులు రాజేశ్వర్ ప్రక్రియను పరిశీలించారు.

సాయంత్రం5 గంటల వరకే నామినేషన్ కేంద్రంలోకి అనుమతి ఉండడంతో పత్రాలు సరైన సమయానికి అందక కొందరు అభ్యర్థులు చివరి నిమిషం వరకు ఉరుకో పరుగో అనుకుంటూ కేంద్రానికి చేరుకున్నారు. 5 గంటల తరువాత కూడా వందల సంఖ్యలో అభ్యర్థులు చేరుకోగా టోకెన్‌ల ద్వారా లోపలికి పంపించారు.

జన్నారం: నామినేషన్ల ఆఖరి రోజు కావడంతో మండలంలో నామినేషన్ల ప్రక్రియ రాత్రి 7గంటల వరకు కొనసాగుతూనే ఉన్నాయి. సమయానికి ముందే అభ్యర్థులు గేటులోపల ఉండడంతో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఎంపీడీవో ఉమర్ షరీఫ్, తహసీల్దార్ రామనోహర్‌రెడ్డి దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

లక్షెట్టి పేట: మండలంలో శనివారం నామినేషన్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. కుల ధృవీకరణ పత్రాల పొందడంలో మీసేవా సర్వర్ ప్రాబ్లమ్ ఉండటంతో నామినేషన్ కేంద్రాలకు సమయంలోపు వచ్చిన వారికి టోకన్లను అందించారు. వారిని మాత్రమే అర్ధరాత్రి అయినా తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.

దండేపల్లి: మొదటి విడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా దండేపల్లి మండలం శనివారం నామినేషన్ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది. నామినేషన్ చివరి రోజు కావడంతో 28 పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల కోసం నామినేషన్ వేసేందుకు భారీగా అభ్యర్థులు తరలివచ్చారు. దీంతో సమయానికి ముందే అభ్యర్థులు గేటులోపల ఉండడంతో నామినేషన్ల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగుతుంది. దీంతో మండల ప్రత్యేక అధికారి దుర్గప్రసాద్, తహసీల్దార్ రోహిత్‌దేశపాండే, ఎంపీడీవో జేఆర్ ప్రసాద్‌లతో పాటు కార్యలయ సిబ్బంది దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

61మంది అభ్యర్థులు సర్పంచ్‌గా గెలిచి తీరుతారు

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు


విలేకరులతో మాట్లాడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మూడు మండలాల నుంచి ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న 61మంది అభ్యర్థులు సర్పంచ్‌గా గెలిచి తీరుతారని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం లక్షెట్టిపేట పట్టణంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలకు తెలుపుతూ ప్రచారం నిర్వహించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ అంటే గిట్టని బీఆర్ఎస్, బీజేపీలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని అవి ప్రజలు నమ్మరన్నారు. గ్యారంటీల అమలు విషయంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు ముందుకు వస్తే తానొక్కడినే సమాధానం చెబుతానని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఏ నియోజక వర్గానికి రాని నిధులు మన మంచిర్యాలకు తెచ్చానన్న విషయం ఆరెండు పార్టీలకు తప్ప ప్రతీ ఒక్కరికీ తెలుసన్నారు.

కేసీఆర్ లాగా తొడ కోసుకుంటే మెడ కోసుకుంటా అనే ఎమ్మెల్యేను కాదని రైతుల కోసం నియోజకవర్గ ప్రజల కోసం పని చేసే ఎమ్మెల్యేను అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్దన్న కూడా ఎన్నికల సమయం నా అభ్యర్థుల కోసం వాళ్ల గెలుపు కోసం ఆరోగ్యం ఎలాగున్నా రాక తప్పదని మొండి కేసి వచ్చానన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం ఎంత చెప్పిన వినక పోవడంతో వాళ్లు ఏర్పాటు చేసిన హెలి క్యాప్టర్‌లో వచ్చానని వాళ్లకు ధన్యవాదాలు తెలిపారు. తన ఆరోగ్యం కుదుటపడాలని కోరుకున్న వారికందరికీ చేతులు జోడించి నమస్కరిస్తున్నానని కంటతడి పెట్టుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట జిల్లా మహిళ నాయకురాలు కొక్కిరాల సురేఖ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, ఆర్టీపీఎస్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండలాధ్యక్షుడు పింగిళి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, డీసీసీ అధికార ప్రతినిధి పూర్ణచందర్‌రావు, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటలో బైక్‌ర్యాలీ..

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు రెండు నెలల తర్వాత లక్షెట్టిపేటకు రావడంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి.ఆరీఫ్ ఆధ్వర్యంలో సుమారు 100 బైక్‌లతో ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు. ర్యాలీలో పలువురు నాయకులు కార్యకర్తలు యువకులు పాల్గొని ఎమ్మెల్యే పీఎస్సార్ జిందాబాద్, జిల్ల టైగర్ పీఎస్సార్ అంటూ నినాదాలు చేస్తు ర్యాలీ చేపట్టారు.

ఎమ్మెల్యే కాన్వాయిలో ఢీకొన్న కార్లు

మంచిర్యాల నుంచి లక్షెట్టిపేటకు వస్తున్న ఎమ్మెల్యే కాన్వాయిలో కార్లు ఢీకొన్నాయి. సుమారు 50 కార్లు ఒకదాని వెనుకాల మరొకటి రావడంతో లక్షెట్టిపేట మండలం శాంతాపూర్ జాతీయ రహదారిపై కాన్వాయిలోని ఒక వాహనం సడెన్ బ్రేక్ వేయడంతో ఒక్కసారిగా ప్రమాదం జరిగింది.


ఈప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. ఎవరికి ఏలాంటి గాయాలు కాలేదు.

ద్విచక్ర వాహనం చోరీ

మంచిర్యాలక్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. చున్నంబట్టి వాడకు చెందిన ముత్యం కమలాకర్ జిల్లా కోర్టు వద్దకు వచ్చాడు. కొంతసేపటి వాహనం కనిపించ లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఎట్టకేలకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మోక్షం

మంత్రి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం ● మార్కెట్ తరలింపునకు సన్నాహాలు


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

చెన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 8 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు ఎట్ట కేలకు మోక్షం లభించింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకట స్వామి ఆదేశాలతో మున్సిపాలిటీ అధికారులు మార్కెట్ తరలింపునకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం ఆవరణలో, చుట్టు పక్కల ప్రాంతంలో పేరుకు పోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఉన్న దుకాణ సముదా యాలను శుభ్రం చేస్తున్నారు. అలాగే జగన్నాథ స్వామి ఆలయం ముందు, కొత్త బస్టాండ్, గాంధీ చౌక్ ప్రాంతంలో రహదారులపై కొనసాగుతున్న కూరగాయల మార్కెట్‌ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు తరలించేందుకు మున్సిపల్ కమిషనర్ మురళీ కృష్ణ సంబంధిత వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరు కూడా రహదారులపై ఇక నుంచి కూరగాయలు విక్రయించరాదని, విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబరు 3న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు అక్కడే కూరగాయలు, చికెన్, మటన్, ఫిష్‌లు విక్రయించాలని కోరారు.

ఆ మూడు పంచాయతీల్లో నామినేషన్ నిల్


దండేపల్లి మండలం గూడెం గ్రామం

దండేపల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం, వందూర్ గూడ, వెంకటాపూర్ గ్రామ పంచాయతీల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దీంతో ఆ మూడు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిలిచిపోనున్నాయి. మూడు రోజుల నుంచి నామినేషన్ దాఖల పర్వం కొనసాగు తుండగా శనివారం నాటికి ఒకరు కూడా నామినేషన్ వేయలేదు. గూడెం గ్రామంలో ఒక్కరు కూడా గిరిజనులు లేరు. కానీ అప్పటి ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్‌గా కేటాయించింది. అధికారుల తప్పిదంతో 1987 నుంచి ఎస్టీకి కేటాయిస్తూ రావడంతో గూడెం పంచాయతీ ఎన్నికలు అప్పటి నుంచి జరగడం లేదు. ఈసారీ కూడా ఇదే పరిస్థితి రిపీట్ అయింది.

నెల్కివెంకటాపూర్ పంచాయతీలో ఇది వరకు వందూర్‌గూడ గిరిజన గ్రామం ఉండేది. వందూర్ గూడను నెల్కివెంకటాపూర్ నుంచి 2019లో అప్పటి ప్రభుత్వం విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసింది. కానీ వందూర్ గూడ గిరిజనులు పంచాయతీ ఏర్పాటును వ్యతిరే కించారు. తమ గ్రామాన్ని నెల్కివెంకటాపూర్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు. ఇక నెల్కివెంకటాపూర్ సర్పంచ్ స్థానం ఎస్టీకి కేటాయించారు. గతంలో వందూర్‌గూడలో కలిసి ఉన్న నెల్కివెంకటాపూర్ పంచాయతీ కావడంతో ఏజెన్సీ గ్రామంగా ఉండేది. కానీ 2019లో రెండు జీపీలు విడదీయడంతో ఇక్కడ గిరిజనులు ఒకరు కూడా లేరు. దీంతో 2019 పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు ఎస్టీ అభ్యర్థులు లేక పంచాయతీ ఎన్నికలు నిలిచిపోయాయి. ఈసారీ కూడా నామినేషన్లు దాఖలు కాకపోవడంతో అదే పరిస్థితి పునరావృతం కానుంది. దీంతో మండలంలోని 31 గ్రామ పంచాయతీలో 28 పంచాయతీలో ఎన్నికలు జరగనున్నాయి.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

మందమర్రిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని తద్వారా విషయ పరిజ్ఞానం కూడా పెరుగుతుందని కార్మెల్ అకాడమి నిర్వహకులు ఫాదర్ జేవీఆర్ రెక్స్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కార్మెల్ పాఠశాలలో పాఠశాల ఉపాధ్యాయురాలు మేరి రాసిన రూట్స్ ఆఫ్ జాయ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మెల్ పాఠశాలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తెస్తున్నారన్నారు. ఆరు దశాబ్దాలుగా పాఠశాల విశేష సేవలందిస్తుందన్నారు. విద్యార్థులు విద్య, క్రీడలతో పాటు పుస్తక పఠనం, రచనలపై ఆసక్తిని పెంచుకోవా లన్నారు. విద్యచెప్పిన గురువులను, జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

కోటపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు బస్సులో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను శనివారం కోటపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పారుపెల్లిచెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. జగ్దల్‌పూర్‌కు వెళ్తున్న బస్సును తనిఖీ చేయగా మహ్మద్ పాషా అనే వ్యక్తి వద్ద మద్యం బాటిళ్లు దొరికాయన్నారు. 400 బాటిళ్లు (క్వార్టర్లు) దొరికాయని, వీటి విలువ సుమారు రూ. 34 వేలు ఉంటుందన్నారు. వీటిని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రీప్రైమరీ పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించాలి



శిక్షకులతో కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రీప్రైమరీ పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించి శిక్షణ ముగింపు కార్యక్రమంలో శనివారం కలెక్టర్ మాట్లాడారు. ప్రీప్రైమరీ పాఠశాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి 29 తేదీ వరకు 41 మంది ప్రీప్రైమ రీ ఇన్‌స్ట్రక్టర్లకు శిక్షణ అందించామనితెలిపారు. జిల్లాలో 41 ప్రీప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేశామని అన్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రాల కంటే మెరుగ్గా విద్య అందుతుందనే భావన కలిగించాలని తెలిపారు. ముఖ్యంగా మూడు నుంచి ఆరేళ్ల వరకు పిల్లలకు బ్రెయిన్ డెవలప్‌మెంట్ అధికంగా ఉంటుందన్నారు. చిన్న పిల్లలకు చక్కని ప్రేమ అప్యాయతలతో బోధించా లని సూచించారు. వారి అభిరుచిని తెలుసుకోవాలని తెలిపారు. వారితో పెయింటింగ్ వేయించాలని, పిల్లలకు సిలబస్‌లోని అంశాలతో పాటు మంచి విలువలు నేర్పించాల ని తెలిపారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, శిక్షకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

రెబ్బెన, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి అధికారులకు నివాస క్వార్టర్ల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని ఎస్‌ఓటు జీఎం రాజమల్లు అన్నారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో అధికారులకు నివాస క్వార్టర్‌ల కౌన్సెలింగ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల బదిలీపై వచ్చి నూతనంగా విధుల్లో చేరిన పలువురు అధికారులకు కౌన్సెలింగ్‌లో ఎంపిక చేసుకున్న నివాస క్వార్టర్లను కేటాయించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌ఓడీఎం శ్రీనివాస్, సివిల్ హెచ్‌ఓడీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ స్థానానికి ట్రాన్స్‌జెండర్ నామినేషన్



మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ సాధన అలియాస్ సంతోష్

జైనూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లవాయి సర్పంచ్ స్థానానికి శనివారం గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ సాధన అలియాస్ సంతోష్ (26) నామినేషన్ దాఖలు చేశారు. మార్లవాయి సర్పంచ్ స్థానం ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న సాధన అలియాస్ సంతోష్ ల్యాబ్ టెక్నీషియన్ శిక్షణ తీసుకున్నారు. నామినేషన్ వేసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. "తాను గెలిస్తే జైనూర్ మండలంలో మార్లవాయి పంచాయతీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.



పల్లె అభివృద్ధిలో సర్పంచే కీలకం

బాధ్యతాయుతమైన పాలన అందించే వ్యక్తిని ఎన్నుకోవాలి

వాంకిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఏ సమస్య ఉన్నా ముందుగా గుర్తొచ్చేది సర్పంచే. అధికారి వచ్చినా, ఇంకెవరైనా వచ్చినా ముందు ఆయనను కలవాల్సిందే. అలాంటి గొప్ప స్థానంలో ఉండాల్సిన వ్యక్తి పూర్తిగా ప్రజల సంక్షేమం కోరే వారై ఉండాలి. ప్రభుత్వ పథకాల అమలులో, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంలోను ఆయన పాత్రే కీలకం. ఈ నేపథ్యంలో మంచి సర్పంచ్‌ను ఎన్నుకోవడంలో పలు మార్లు ఆలోచించుకోవాలి. మనం ఎన్నుకునే నాయకుడు కాలనీకో సీసీ రోడ్డు, రెండు భవనాలు, మురికి కాలువలు నిర్మించగానే అభివృద్ధి జరుగదు. ప్రతి విషయంపై వారికి పట్టు ఉండాలి. సామాజికంగాను అన్ని విషయాలను తెలుసుకుంటూ అన్ని రంగాల్లోనూ తమ గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలి. చాలా చోట్ల నాయకులు పలుకుబడి ఉన్న వారికి అండగా ఉంటూ పేదలకు అన్యాయం చేస్తున్నారని చాలా విమర్శలు ఉంటాయి. ఇలాంటి వాటిని ఎప్పటికీ మర్చిపోకుండా ప్రతీ ఒక్కరికి సరైన న్యాయం చేసే వారు ఉండాలి. ఒక్క వ్యక్తిగత విషయంలోనే కాదు ప్రభత్వ పకథకాల అమలులోనూ ఎలాంటి తేడా లేకుండా న్యాయం చేసేవారు ఉండాలి.

జిల్లాలో 335 పంచాయతీలు..

జిల్లాలో 335 గ్రామ పంచాయతీ పరిధిలో 2,874 వార్డులు ఉన్నాయి. జిల్లాలోని మొత్తం 15 మండలాల్లో మొత్తం 3,53,895 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు 20 మంది ఇతరులు ఉన్నారు. వీటి పరిధిలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దేశానికి పట్టుకొమ్మలు గ్రామలే అన్నినానుడి నిజంకావాలంటే స్థానికంగా మనం ఎన్నుకునే సర్పంచ్ అభ్యర్థే ప్రధానం. గ్రామ ప్రజల మీద, అభివృద్ధిపై దృష్టి సారించే వారిని ఎన్నుకోవడమే ప్రధానం. పార్టీలు, కుల, మత బేధాలు లేకుండా పని చేస్తారా లేదా ?అన్నదే ముఖ్యం. ఐదేళ్ల పాటు పాలించే వ్యక్తిని ఎన్నుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచించాలి.

ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా..

మనం ఎన్నుకుంటున్న అభ్యర్థి అన్నివిధాల ప్రజలకు ఉపయోగకరమై ఉండేలా చూసుకోవాలి. డబ్బులు ఉన్న వ్యక్తులు పదవులను ఆశిస్తూ ఎన్నికల సమయంలో ఓటుకు నోటు, మద్యం సరఫరా చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తుంటారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది. ఓటును డబ్బుకు విక్రయిస్తే మనం వేసే ఓటు అమ్ముకున్నట్లే. ఆ ఓటకు విలువ ఉండదు. అందుకోసం డబ్బులకు ఆశపడద్దు, మద్యానికి బానిస కావద్దు, ప్రజలకు సేవచేసే సమర్థుడైన అభ్యర్థిని అన్వేషించి అభివృద్ధికి వారధిగా ఉండే నాయకుడిని ఎన్నుకోవాలి.

సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మిస్తేనే అభివృద్ధి జరుగదు. ఇలాంటి పనులు చేయడం వల్ల తమ స్వార్థం కోసం ఎంతో కొంత మిగులుబాటు ఉం డడంకోసం చేస్తున్నారనుకోవడంలోనూ సందేహం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై గ్రామాల అభివృద్ధి, సమస్యలను తీర్చేందుకు కనీ స అవగాహన ఉన్నవారు ఉండాలి. ప్రతి గ్రామంలోనూ ఎదో ఒక విషయంలో గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నవారు తప్పకుండా ఉంటారు. అలాంటి వారికి ప్రజలు అవకాశం ఇవ్వాలి. ప్రభు త్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించేలా చూసినప్పుడే నిజమైన నాయకుడు. స్థానికంగా ఉండే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అక్కడ చదువుకుంటున్న విద్యార్థులకు ఉన్నత విద్య చదివించేందుకు దిశా నిర్దేశం చేయించాలి. ప్రతి ఒక్కరూ చదువుకునేలా దారులు చూపించాలి. చాలా చోట్ల మేము ఇన్నేళ్లుగా రాజకీయంలో ఉన్నామంటూ మాట్లాడుతుంటారు. అలాంటి వారి మాటలను వినే ముందు ఏ రకంగా అభివృద్ధి చెందాం, ఎవరు అభివృద్ధి చెందారు అని ఆలోచిస్తే అర్థమవుతుంది.

ఏళ్ల తరబడి..

ఎళ్లతరబడి పంచాయతీలతో పాటు వాటి అనుబంధ గ్రామాలకు కనీస సమస్యలు తీర్చే వారు కరువయ్యారు. గెలిపించిన నాయకులు తమ ఆస్తులు పెంచుకోవడంలోనే నిమగ్నం కావడంతో ప్రజల సమస్యలను, ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంలో చాలా చోట్ల విఫలమయ్యారు. అలాంటివి అన్నీ బేరీజు వేసుకోవాలి. గ్రామానికి తగిన న్యాయం చేస్తారా లేదా? అన్ని రకాలుగా చూడాలి. గతంలో ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించారా లేక అనుర్హులకు అందించారా, విద్య, వైద్య పరంగా ప్రజలకు ఏ విధంగా మేలు చేకూర్చారు, రహదారి, రవాణా సౌకర్యం పరంగా ఏమైనా సమస్యలు తీర్చారా లేదా, ప్రస్తుతం ఎన్నో సంస్థలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి అలాంటి వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి.

సాధారణంగా పల్లె యువతకు విద్య పరంగా అంతగా అవగాహన ఉం డదు. అలాంటి పరిస్థితిలో ఉన్నత విద్య అందించేందుకు వారిని ముందుకు తీసుకెళ్లాలి. చదువుకునేందుకు అన్ని రకాలుగా అండగా ఉండాలి. అందుకు ఎన్నో స్వచ్ఛంద సంస్థలు కూడా ఉన్నాయి. స్థానిక ప్రజలకు ఏ విషయంలోనూ ఇబ్బంది లేకుండా చూడాలి. కాలానుగుణంగా వ్యాధులు ప్రబలుతుంటాయి అలాంటి సమయంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించేలా చూడాలి.

ఇంటి నిర్మాణానికి తెచ్చిన స్టీలు చోరీ

పోలీసులు చర్యలు తీసుకోవాలని వినతి

జైపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తన ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన ఇనుప రాడ్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగలిం చారని బాధితుడు గోదారి కిష్టయ్య వాపోయాడు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన తాను తన ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ వేసేందుకు సుమారు ఆరు టన్నుల ఇనుప రాడ్లు (స్టీల్) తీసుకువచ్చినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి సమయం లో గుర్తు తెలియని వ్యక్తులు స్టీలును ఎత్తుకెళ్లినట్లు తెలిపాడు. దొంగలించిన స్టీలు విలువ రూ. 3 లక్షలు ఉంటుందన్నారు. తన ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతుండగా ఇంత పెద్ద మొత్తంలో స్టీలు చోరీకి గురి కావడం ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. దొంగతనం జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. తనకు జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని దర్యాప్తు చేసి దొంగలను పట్టుకుని తనకు న్యాయం చేయాలని కిష్టయ్య కోరాడు. ఈ విషయంపై జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడు తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

గంజాయి మొక్కలు పట్టివేత

లింగాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండలంలోని ఎల్లాపటార్‌లో శనివారం పోలీసులు గంజాయి మొక్కలు పట్టుకున్నారు. గ్రామంలోని ఓ రైతు చేనులో గంజాయి సాగు చేస్తున్నారని సమాచారం అందడంతో వ్యవసాయ అధికారుతో కలిసి పరిశీలించగా రెండు గంజాయి మొక్కలు లభించాయని ఎస్సై గంగన్న తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. గంజాయిని రైతులు సాగు చేయకూడదని చెప్పారు. ఎవరైనా సాగు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలి



సిర్పూర్(టి)లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సిర్పూర్(టి), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మార్గ దర్శకాలను పకడ్బందీగా అమలు యేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగుతున్న ఎన్నికల నిర్వహణ ప్రక్రియల నిర్వహణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది సమన్వయం, ఎన్నికల సామగ్రి పంపిణీ అంశాలలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, విధు లలో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాతో కలిసి సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం సిబ్బంది, పారిశుధ్య సిబ్బందిని తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. విద్యార్థులకు క్రీడా అవసరాల కోసం తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రహరీ గోడ నిర్మాణం, నీటి అవసరాలకు చేతి పంపు మరమ్మతు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ నెల 28వ తేదీన విధులు నిర్వహించిన ఉపాధ్యా యుల నుంచి విధి నిర్వహ ణలో అలసత్వానికి సంఘటనకు కారణాలపై వివరణ తీసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు నారాయణసింగ్‌ను సస్పెండ్ చేస్తూ ఎంఈవో ను ఆరోపణలపై వివరణ కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

పరిశీలించి.. సూచనలు చేసి..

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా సాయుధ పోలీసు దళాన్ని శనివారం ఎస్పీ నితికా పంత్ సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. పలు విభాగాలను ఈ సందర్భంగా హెడ క్వార్టర్ ఆవరణలో బెల్ ఆఫ్ ఆర్మ్, వర్క్ షాప్, అమ్యూనిషన్ డంప్, వివిధ స్టోర్స్, మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం, హోంగార్డు ఆఫీస్, స్పెషల్ పార్టీ ఆఫీస్, షటిల్ కోర్టు, మీటింగ్ హాల్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆయుధాల భద్రత ప్రమాణాలు, అమ్యూనిషన్ నిల్వ విధానం, రికార్డుల నిర్వహ ణ, సిబ్బంది హాజరు, వాహనాల నిర్వహణ వంటి అంశాలను ఎస్పీ పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఆయుధాల రిజిస్టర్, స్టోర్ స్టాక్ వివరాలు, వాహనాల లాగ్ బుక్స్, ఇతర రికార్డులను పరిశీలించారు. వివరాలు ఆర్‌ఐ అంజయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంటీవో అంజన్న, ఆర్‌ఎస్సై లవన్ తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నితికా పంత్

ప్రజల భద్రతే ధ్యేయం




గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ సంజయ్

రెబ్బెన, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీసులుపని చేస్తున్నారని సీఐ సంజయ్ అన్నారు. రెబ్బెన మండలం పుంజుమేరగూడలో జిల్లా నితికా పంత్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు గ్రామంలో శనివారం పోలీసు కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సరైన ధ్రువ పత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఫోర్‌వీలర్స్ వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.. గుడుంబా, గంజాయి, రేషన్ బియ్యం సరఫరా వంటివి తమ దృష్టికి వస్తే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. ఎలక్షన్ సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోను కవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటకృష్ణ, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

రెబ్బెన, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖైరిగూడ ఓపెన్ కాస్టు ప్రాజెక్టులో సుదీర్ఘకాలంగా సేవలందించి పదవీ విరమణ పొందిన సీనియర్ హెడ్ ఓవర్‌మెన్ రవీందర్, సీనియర్ మైనింగ్ సర్దార్ సత్యనారాయణను ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో నాయకులు శ్రీనివాస్, తిరుపతి, మొగిలి శనివారం సన్మానించారు. కార్యక్రమంలో నరేందర్, మేనేజర్ శంకర్, రక్షణాధికారి గౌతమ్, రాజేశ్వర్‌రెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్ రజినికుమార్, నాయకులు శేషశైనా రావు, రాజేష్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఓదెలు, అంజయ్య, రాజయ్య, రవీందర్, ఆఫ్రీది, సింహాద్రి, షకిల్, రమేష్, నరేష్, రాజు, లక్ష్మీనారాయణ, నర్సింగం, రామ్‌కిషన్, సుదీర్, నారాయణ, హర్షద్ బాబా, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రయోజనం



మాట్లాడుతున్న ఎస్‌ఓటు జీఎం ఎల్‌ఆర్ ప్రసాద్

మందమర్రిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్నటువంటి కాంట్రాక్టు ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనాలు చేకూర్చేందుకు ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్(ఈఎస్‌ఐ) స్కీం చేయించుకోవాలని ఎస్‌ఓటు జీఎం లలిత ప్రసాద్, బెల్లంపల్లి ఎస్‌ఓటు జీఎం కే. రాజమల్లు అన్నారు. జీఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ స్కీం ద్వారా అనారోగ్య ప్రయోజనం, బీమా బెనిఫిట్స్, ప్రసూతి ప్రయోజనం, వైద్య ప్రయోజనం, సూపర్‌స్పెషాలిటి ప్రయోజనం, లైఫ్‌టైం పెన్షన్ ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ఈఎస్‌ఐ స్కీం రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాంట్రాక్టు ఉద్యోగులకు అందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా బీసీడీవో గోదావరిఖని బ్రాంచి మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులందరూ స్కీంలో చేర్చుకునే విధంగా చూడాలని తెలిపారు. వారికి ఇన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయనే విషయం తెలియజేయడంతో సులభతరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ సత్యనారాయణ, బ్రాంచి సెక్రటరీ అక్బర్ అలీ, పర్సనల్ మేనేజర్ అశోక్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శనివారం మిల్లెట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు రాగి ఇడ్లీలు, రాగి జావా, లడ్డులు, ఉప్మా, కిచిడి, చట్నీ, స్వీట్స్, కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలతో రకరకాల మిల్లెట్స్‌తో తయారు చేసిన ఫుడ్ ఐటెంను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వాంకిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు రహెమాన్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన జర్నలిస్టుల మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సురేష్‌చారి, రాధాకృష్ణచారి, సునీల్, రవీంద్రచారి, విభూతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



ఆర్‌కే 7 గనిపై ఉద్యోగిని సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిసుంద ని పలు యూనియన్ల నాయకులు, అధికారులు అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్‌ఆర్‌పీ 1, ఎస్‌ఆర్‌పీ 3, 3ఏ, ఆర్‌కే 7 గనులపై ఉద్యోగులు రిటైర్ కాగా వారిని శనివారం సన్మానించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడారు. ఉద్యోగులు 30, 40 ఏళ్లపాటు సంస్థకు సేవలందించి, అభివృద్ధికి కృషి చేయడం ఆనందదాయకమన్నారు. ప్రతి కార్మికుడు పోషించిన పాత్రను ప్రశంసించారు. వారికి సీఎంపీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, సీపీఆర్ఎంఎస్ తదితర సదుపాయాలు అందేలా అధికారులు సహకారం అందించాలన్నారు. ఎస్‌ఆర్‌పీ 1 గనిలో ఆజ్మీర శంకర్‌ను మేనేజర్ ఆత్మారాం సహాని, సంక్షేమాధికారి అరుణ్‌తేజ సన్మానించి, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి చంద్ర ముర్మ, సీనియర్ అసిస్టెంట్ క్రాంతి కుమార్, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఆర్‌పీ 3, 3ఏ గనిపై తోట మొగిలి, కొండ రాములు, చల్ల బాపు, కుదిరి శ్రీనివాస్, బండపాటి రాజిరెడ్డి ఉద్యోగ విరమణ పొందగా, వారిని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, పిట్ కార్యదర్శి మురళీచౌదరి, ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్ రావు, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, పిట్ కార్యదర్శి తీగల వెంకట్ రెడ్డి సన్మానించారు. నాయకులు తొటం మల్లేష్, వెంకట రమణారెడ్డి, జంగా తిరుపతిరెడ్డి, వినయ్, తదితరులు పాల్గొన్నారు. సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం పక్షాన రాష్ట్ర కోఆర్డినేటర్ ముష్కె సమ్మయ్య, ముఖ్య సలహాదారు మధుసూదన్, ఆర్‌కే 5 పిట్ కార్యదర్శి కారుకూరి మనోజ్, తదితరులు సత్కారం చేసి వారితో గల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఆర్‌కే 7 గనిపై ఉప్పరి చంద్రశేఖర్, భీమయ్యలు రిటైర్ కాగా, వారిని మేనేజర్ తిరుపతి సన్మానించారు. సర్వీస్ బెనిఫిట్ చెక్కులు అందించారు. యువ ఉద్యోగులు సీనియర్లను ఆదర్శంగా తీసుకొని విధులకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, రక్షణాధికారి సంతోష్ రావు, పిట్ కార్యదర్శి మారపల్లి సారయ్య, సంక్షేమాధికారి సంతన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే గురువులైన వేళ..

దండేపల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గుడిరేవు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని శనివారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఈవోగా జశ్వంత్, పాఠశాల హెచ్ఎంగా బండారి నందిని, ఉపాధ్యాయులుగా గణేష్, అమూల్య, బన్నీ, నవ్య, మణి తేజ, వరుణ్‌తేజలు వ్యవహరించారు.

షీటీంపై అవగాహన

చెన్నూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం షీటీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం సిబ్బంది షీటీం సేవలు, డయల్ 100 గురించి అవగాహన కల్పించారు. ఆకతాయిలు ఎవరైనా వేధింపులకు పాల్పడితే షీటీంకు 6303923700కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం సిబ్బంది సతీష్, శ్రీలత, హెచ్ఎం సయ్యద్ నజీబ్ అలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ముసాయిదా విత్తన చట్టంపై అభిప్రాయ సేకరణ చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముసాయిదా విత్తన చట్టంపై అభిప్రాయ సేకరణ చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పాత విత్తన చట్టం 1966ను మార్చి నూతన విత్తన చట్టం 2025 తీసుకురావాలనే ఆలోచనతో ప్రతిపాదించిన ముసాయిదాపై అందరి భాగస్వామ్యంతో అభిప్రాయ సేకరణ చేపడతామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి సురేఖ, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మహేష్ పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత

జన్నారం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్‌టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో గల ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో ఇటీవల పులి దాడి చేసి ఆవును హత మార్చింది. దీంతో అటవీ రేంజ్ అధికారి లక్ష్మీ నారాయణ బాధితులు పూజారి శ్రావణ్ కుమార్‌కు 25వేల నష్టపరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌డీలు హన్మంతురావు తన్వీర్ పాషా, రవి సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క చాన్స్ ప్లీజ్



నేతల చుట్టూ ఆశావాహుల ప్రదక్షిణలు
గ్రామాల్లో వేడెక్కుతున్న రాజకీయం

బెల్లంపల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఆశావహులు బరిలో దిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎప్పటి నుంచో పార్టీలో ఉంటూ ప్రజల్లో ఉంటున్నానని సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం ఇస్తే ప్రజా ప్రతినిధిగా ఎన్నికవుతానని ఒక్కచాన్స్ ఇవ్వండి ప్లీజ్ అంటూ ఆశావహులు స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వారి మద్దతు కోసం ఎదురు చూస్తున్నారు.

మద్దతు కోసం నేతల చుట్టూ...

పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లుగా పోటీ చేసే ఆశావహులు తమ తమ పార్టీ నాయకుల మద్దతు కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు ఆయా పార్టీల గుర్తులు ఉండనప్పటికీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల మద్దతు ప్రకటించిన అభ్యర్థులే కీలకంగా మారనున్నారు. దీంతో ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టుకునేందుకు ఆశావహులు ఆయా నేతల చుట్టు ప్రదిక్షణలు చేస్తున్నారు. ముఖ్యంగా మేజర్ పంచాయతీలలో పాగా వేయాలనే అభ్యర్థులు తాము ఖర్చుకు వెనుకాడమని ఎలాగైన ఎన్నికల్లో గెలిచితీరుతామని తమకు మద్దతు ప్రకటించాలని కోరుకుంటున్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులను కైవసం చేసుకునేందుకు పెద్ద ఎత్తున పోటి నెలకొంటుండడంతో నేతల ప్రసన్నం తప్పనిసరిగా మారుతోంది.

ఎన్నికల్లో గెలిచేందుకుగాను తమకు ఏయే అంశాలు అనుకూలంగా ఉన్నాయనే విషయమై ఆశావహులు నేతల ముందు చెప్పుకుంటున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేలతో పాటు మాజీ ఎమ్మెల్యేల చుట్టూ తమ మద్దతుదారులతో కలిసి నేతల చుట్టు బలనిరూపన చేసుకునేందుకు సిద్దపడుతున్నారు.

పోటాపోటీగా ఆశావహులు...

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు మెంబర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటాపోటీగా ఆశావహులు ఉన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవుల కంటే సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు నాయకులు ఉత్సాహం చూపుతున్నారు. ప్రధాన పార్టీల మద్దతు కూడగట్టుకునేందుకు ఆయా నేతల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. పలు మేజర్ గ్రామ పంచాయతీలకు ఒక్కో గ్రామం నుంచి ఐదు నుంచి పది మంది సర్పంచ్ స్థానాలకు పోటీపడుతున్నారు. అలాగే వార్డు మెంబర్లకు సైతం పోటీ ఎక్కువగానే నెలకొంది. సర్పంచ్ బరిలో ఉన్న ఆశావహులు ప్రస్తుత అధికార పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలను, ముఖ్య నాయకులను తమకే టిక్కెట్ కేటాయించాలని కోరుకుంటూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలతో ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు సంప్రదింపులు చేస్తున్నారు. తమకే టికెట్ కేటాయించాలని పెద్ద ఎత్తున ఆశావహులు నేతలను కలుస్తుండడంతో ఎవరికి టిక్కెట్ కేటాయించాలనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. నేతల ప్రసన్నం చివరికి ఎవరికి దక్కుతోందో మరి కొద్ది రోజుల్లో తేలనుంది.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో అన్నదానం



స్వామి చిత్రపటాలతో వస్తున్న రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని హైటెక్ సిటీ మైదానంలో శనివారం వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం, అయ్యప్ప భక్తులకు అన్నదాన, అల్పాహార వితరణ నిర్వహించారు. గురుస్వాములను ఘనంగా సత్కరించారు. హైటెక్ సిటీ ప్రాంతం ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. రఘునాథ్ వెరబెల్లి మాటాడుతూ ప్రజలందరినీ స్వామి చల్లగా చూడాలని ఆ కాంక్షించారు. దాదాపు 3 వేల మంది భక్తులకు, ప్రజలకు అన్నదానం చేశారు.

నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

జైపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జైపూర్ సీఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలతో ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలన్నారు. ప్రజలకు నామినేషన్ కేంద్రాల గురించి అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ శ్రీధర్, ఎంపీవో శ్రీపతి బాపురావులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

కోటపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన 53వ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని అన్నారం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. గైడ్ టీచర్ ఎస్. సురేందర్ పర్యవేక్షణలో విద్యార్థులు తగరం జశ్వంత్, ఏ. శ్రావణ్, ఏ. అరవింద్, ఎస్‌డీ సర్తాజ్‌లు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నారు. వీరిలో ఎస్‌డీ సర్తాజ్ హెల్త్ అండ్ హైజిన్ అంశంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు గైడ్ టీచర్ సురేందర్ పేర్కొన్నారు. అలాగే శ్రావణ్ ఎమర్జింగ్ టెక్నాలజీ విభాగంలో రెండో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులను గైడ్ టీచర్ సురేందర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా విద్యాధికారి యాదయ్య, సైన్స్ ఆఫీసర్ రాజగోపాల్, హెచ్ఎం రమేష్ ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రాండ్ పేరెంట్స్‌డే

లక్సెట్టిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేటలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్‌డేను పాఠశాల యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రైమరీకి చెందిన విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌ని పాఠశాలకు ఆహ్వానించడంతో పాటు విద్యార్థులచే వారిని శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానం చేయించారు. పిల్లలు పేరెంట్స్‌కి ఏలాంటి మర్యాదలు ఇవ్వాలి, అమ్మమ్మ, నానామ్మ, తాతాయ్యలకు సేవలు చేస్తే ఏర్పడే నైతిక విలువలపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అశ్విని, అకాడమిక్ డీన్ సుధీర్, ప్రైమరీ ఇన్‌చార్జి శైలజ, పీఈటి రమేష్ పాల్గొన్నారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

హాజీపూర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7,8,9 తేదీల్లో జరుగుతున్న సీఐ టీయూ రాష్ట్ర 5వ మహాసభలను విజయ వంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట గోదాం వద్ద శనివారం సీఐటీయు ఆధ్వర్యంలో శనివారం మహా సభల పోస్టర్లు విడుదల చేశారు. డి సెంబర్ 5న మెదక్ పట్టణంలో జరిగే ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, హమాలీ యూనియన్ అధ్య క్షుడు, కోశాధికారి మహేందర్, ఉపాధ్యక్షుడు మిట్ట మల్లేష్, సహాయ కార్యదర్శులు సుధాకర్ మేస్త్రి శంకర్, సభ్యులు దేవేందర్, పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు : ఏసీపీ

వేమనపల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలో డిసెంబరు 14వ తేదీన జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన భద్రత ఏ ర్పాట్లను చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై పోలీసు అధికారులతో మండల అధికారులు సమావేశమయ్యారు. ఏసీపీ మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో జరుగనున్న ఎన్నికల నిర్వహణ కోసం ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నేడు మండలంలో నామినేషన్ స్వీకరణ కేంద్రా ల్లో అధికారులు అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించినట్లు తెలిపారు. ఎంపీడీవో కుమారస్వామి, చెన్నూర్ రూరల్ సీఐ బన్సిలాల్, ఎస్ఐ శ్యామ్‌పటేల్, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

భీమారం: ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయమని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బూరుగుపల్లిలో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఇళ్లలో సోదాలు చేసి సరైన పత్రాలు లేని 26 ద్విచక్ర వాహనాలను సీజ్, అక్రమంగా విక్రయిస్తున్న 5 లీటర్ల మద్యం, 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 500 లీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. అలాగే ఎన్నికలను దృష్టిలోఉంచుకుని అందరు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైపూర్ సీఐ నవీన్, ఎస్ఐలు సుబ్బారావు, శ్రీధర్, రాజేందర్, ఎక్సైజ్ ఎస్ఐలు శంకర్, మనిషారాథోడ్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

కాసిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధర్మారావుపేట జిల్లా పరిషత్ పాఠశాలకు శనివారం మందమర్రికి చెందిన బొంకూరి మోహన్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు అరుణ్‌ప్రదీప్, కిరణ్‌సందీప్‌లు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి క్రీడా సామగ్రిని అందజేయడం ఆనందంగా ఉందన్నారు. దాతలు అరుణ్‌ప్రదీప్, కిరణ్ సందీప్‌లు మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతియేటా క్రీడా సామగ్రిని అందజేస్తున్నామన్నారు. అలాగే పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. చదువుకోలేని నిరుపేద విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామన్నారు. దాతలను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దాత కుటుంబ సభ్యులు సంధ్య, శృతి, వినయకుమారి, బాబ్జీ పాల్గొన్నారు.

నిఘా నీడలో పంచాయతీ పోరు..

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు వద్ద పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూశాఖల అధికారులతో పకడ్బందీగా వాహన తనిఖీలు చేపడుతున్నారు.

ప్రత్యేక బలగాలతో..

ఎన్నికల సందర్భంగా జిల్లా సరిహద్దు ప్రాంతాలను చెక్ పోస్టులతో కట్టడి చేయగా, రహదారుల వెంట స్థానికులకు పోలీసులకు అదనంగా ప్రత్యేక సాయుధ బలగాలతో నిఘా ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్), క్విక్ రియాక్షన్ టీమ్ (క్యూఆర్‌టీ)లతో ఏర్పాట్లు కట్టుదిట్టం చేయగా, మొత్తంగా 800 మంది సిబ్బందితో నిఘా పెడుతున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా రహదారులపై నిఘా ముమ్మరం చేసేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో స్టాటికల్ సర్వేయ్ లెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ), మండలానికి ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్‌టీ)ను ఏర్పాటు చేసింది. ఆయా టీమ్స్ లో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, పోలీస్ శాఖకు చెందిన ఎస్సై, ఏఎస్సై స్థాయి అధికారి, రెవెన్యూ డిపార్టుమెంట్‌కు చెందిన ఉద్యోగులు సభ్యులుగా ఉంటారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలతో పాటు భీమిని మండలంలోని కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన నాలుగు గ్రామాలు, నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలం కోసం ఆయా టీమ్‌లను సర్దుబాటు చేశారు. ఎన్నికల బందోబస్తుకు 800 మంది సిబ్బందిని కేటాయించగా, డీసీపీ నేతృత్వంలో ముగ్గురు ఏసీపీలు, 15 మంది సీఐలు, 30 ఎస్సైలు, 100 మంది ఏఆర్ సిబ్బంది, 200 మంది క్యూఆర్టీ సిబ్బంది, 600మంది సివిల్ కానిస్టేబుళ్లతో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల ప్రచారంపైనా ఆంక్షలు...

మొదటి విడుత నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల ప్రచారంపైనా పోలీస్‌శాఖ పలు ఆంక్షలు విధించింది. మొదటి విడుత ఎన్నికల ప్రచారం డిసెంబరు ఒకటి నుంచి 9వ తేదీ వరకు ఉదయం 6 నుంచి రాత్రి 10 వరకు ప్రచారం నిర్వహించేందుకు అవకాశం కల్పించింది. లౌడ్ స్పీకర్లు, బహిరంగ సభలు ఏర్పాటు చేయాలనుకునే వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తారు.

క్లస్టర్ల వారీగా నామినేషన్ల స్వీకరణ

నెన్నెల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) రెండో విడత పంచాయతీ ఎన్నికల కోసం ఆదివారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. మండలంలోని 19 జీపీలకు ఏడు క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. ఆ పరిధిలోని గ్రామాల అభ్యర్థులు ఎంపిక చేసిన క్లస్టర్‌కు వెళ్లి నామినేషన్ దాఖలు చేసేలా ఏర్పాట్లు చేశారు. మన్నెగూడం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జంగాల్‌పేట, మన్నెగూడం, కోనంపేటలు, నెన్నెల జీపీ ఆఫీసులో నెన్నెల, కుశ్నపల్లిలు, నందులపల్లి జీపీ కార్యాలయంలో నందులపల్లి, ఘన్‌పూర్, జోగాపూర్‌లు, ఖైలారం జీపీ ఆఫీసులో ఖైలారం, గొళ్లపల్లిలు, మెట్‌పల్లి జీపీ కార్యాలయంలో మెట్‌పల్లి, చిత్తాపూర్, నార్వాయిపేట, గుండ్ల సోమారంలు, ఆవడం జీపీ ఆఫీసులో ఆవడం, గంగారం, జెండా వెంకటాపూర్‌లు, కొత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొత్తూరు, చిన్నవెంకటాపూర్ గ్రామాల నామినేషన్లు స్వీకరిస్తారని ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోనే అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మండల మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్‌తోపాటు పొన్కల్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ జక్కు భూమేశ్, కలమడుగు మాజీ సర్పంచ్ బొంతల మల్లేశ్, మాజీ బీజేపీ నాయకులు ఎమ్మెల్యే కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, మండల మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు ఫసియుల్లా, అల్లం రవి, సయ్యద్ ఇసాక్, సుభాష్ రెడ్డి, మోహన్ రెడ్డిలతో పాటు పాల్గొన్నారు

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ముందుండాలి

బెల్లంపల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ముందుండాలని డీఈవో యాదయ్య అన్నారు. శనివారం పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఈ క్రీడా పోటీల్లో 500 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. పుట్‌బాల్, వాలీబాల్‌తో అథ్లెటిక్ విభాగంలో 100 మీటర్ రన్ పోటీలను నిర్వహించారు. పీఎంసీ జిల్లా స్థాయి పుట్‌బాల్ పోటీల్లో బెల్లంపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం కైవసం చేసుకోగా ద్వితీయ స్థానాన్ని గుడిపేట మహాత్మజ్యోతిబాపూలే విద్యార్థులు కైవసం చేసుకున్నారు. వాలీబాల్ పోటీల్లో లక్సెట్టిపేట ఎంజేపీ మొదటి స్థానం, మంచిర్యాల మోడల్ స్కూల్ 2వ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయసాగర్, జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి యాకూబ్, నిర్వాహకులు అల్లూరి వామన్, పీఈటీ రాజశేఖర్, బండి రవి, చాంద్‌పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రికి ముందస్తు జన్మదిన వేడుకలు

మందమర్రిటౌన్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామిని మందమర్రి కాంగ్రెస్ నాయకులు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 30న మంత్రి జన్మదిన వేడుకల సందర్భంగా ముందుగానే వెళ్లి కేక్‌కట్ చేసి స్వీట్లు తినిపించారు. కాంగ్రెస్ జిల్లా పట్టణ నాయకులు గుడ్ల రమేశ్, ఎండీ ఇసాక్‌లు ఉన్నారు.

యూనిటీ మార్చ్‌లో పాల్గొన్న జిల్లా యువకులు

తాండూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా హైద్రాబాద్ నుంచి గుజరాత్ సర్దార్ పటేల్ యూ నిటీ విగ్రహం వరకు చేపట్టిన యూనిటీ మార్చ్ లో బీజే వైఎం జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పించాలి

కాసిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నామినేషన్‌ల కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఎల్‌పీవో సతీష్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కాసిపేట, ముత్యంపల్లి గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్‌ల స్వీకరణ ఆదివారం నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. నామినేషన్‌ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అధికారులు చూడాలన్నారు. నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఎంపీవో సప్దర్ అలీ ఉన్నారు.

బీమా చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కు అందిస్తున్న బ్యాంక్ సిబ్బంది

సంక్షిప్త సమాచారం

జైపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టేకుమట్ల గ్రామానికి కె. శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందగా అతడి భార్య తేజకి శనివారం రూ. 2 లక్షల బీమా చెక్కును జైపూర్ ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ అమిత్‌కు మార్, ఫీల్డ్ ఆఫీసర్ సాయి బ్యాంకులో అందజేశారు. సిబ్బంది సురేష్, సుధాకర్, వినయ్, జగన్ పాల్గొన్నారు.

చెన్నూరు : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద శనివారం ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం కింద చెక్కులను బ్యాంకు అధికారులు అందజేశారు. సుద్దాల గ్రామానికి చెందిన రామగిరి స్వప్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె భర్తకు రూ. 2 లక్షల చెక్కును అందించారు. కిష్టంపేటకు చెందిన వెగండ్ల శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన భార్య ఈశ్వరికి రూ. 2 లక్షల చెక్కు అందించారు. ఎస్‌బీఐ మంచి ర్యాల ప్రాంతీయ వ్యాపార కార్యాలయం మేనేజర్ క్రాంతిరేఖ, కిష్టంపేట శాఖ మేనేజర్ నవీన్‌కుమార్‌రెడ్డి, ఫీల్డ్ అధికారి రవికుమార్, సిబ్బంది రాజేందర్, రోస్‌లీలా, పరమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

బెల్లంపల్లి, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనుండగా... రెండో విడత నామినేషన్లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, వేమనపల్లి, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లో మొత్తం 114 గ్రామ పంచాయతీలు ఉండగా 996 వార్డులు ఉన్నాయి. సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుండగా ఆదివారం నుంచి డిసెంబర్ 3 వరకు నామినేషన్లను సంబంధిత అధికారులు స్వీకరించనున్నారు. ఇందు కోసం నాలుగు ఐదు గ్రామ పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఆయా క్లస్టర్ కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స ర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థుల నుంచి సంబంధిత అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందు కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

తాండూర్ : తాండూర్ మండలంలో 15 గ్రామపంచాయతీలకు గాను ఆది వారం నుంచి నామినేషన్‌ల స్వీకరణ ఉంటుందని ఎం పీడీవో శ్రీనివాస్ తెలిపారు. అచ్చలాపూర్, కిష్టంపేట, తాండూర్, మాదారంలో నామినేషన్ కేంద్రాలను ఏ ర్పాటు చేశామన్నారు.


సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ

లక్సెట్టిపేట, నవంబరు, 29(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకులంకు చెందిన విద్యార్థిని బాల విజ్ఞాన ప్రదర్శనలో జిల్లా స్థాయి విభాగంలో అత్యున్నతమైన ప్రతిభ కనబర్చి శభాష్ అనిపించుకుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అక్స్‌ఫోర్డు ఉన్నత పాఠశాలలో ఈనెల 26నుండి మూడు రోజుల పాటు 53వ జిల్లా స్థాయి బాల విజ్ఞాన ప్రదర్శన నిర్వహించగా స్థానిక గురుకులంలో 8వ తరగతి చదువుతున్న జాహ్నవి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలవడంతో పాటు మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని ప్రిన్సిపల్ రమాకళ్యాణి, గైడ్ టీచర్స్ శిరీష, బాగ్యలక్ష్మితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందించారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

మంచిర్యాల డీసీపీ ఎగ్గడి బాస్కర్

దండేపల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థ ఎన్నికల నేపద్యంలో ఎవరైన ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ హెచ్చరించారు. శనివారం రాత్రి మండంలోని వెల్గనూర్ గ్రామంలో ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరు ప్రశాంత వాతావరణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. ఎవరైన ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒకరు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిష్పక్షపాతంగా శాంతియుతంగా ఎన్నికలు జరిగే విధంగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శాంతిభద్రత విషయంలో ఎలాంటి రాజీలేదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు అంశా లపై ప్రజలకు వివరించారు. డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి. దండేపల్లి ఎస్సై తహసీనోద్దీన్ , పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

దండేపల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు సేవలను ప్రతీ ఒకరు తప్పకుండా వినియోగించుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకుల రీజనల్ మేనేజర్ ఆర్ఎం గిరిమోజు నాయక్ సూచించారు. శనివారం దండేపల్లిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్‌ని సందర్శించి రైతులు, ఖాతదా రులకు ప్రభుత్వం అందించే బ్యాంకు సేవలు, రుణాల తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. బ్యాంకు ఖాతాదారులు ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకుల పేరుతో ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పొద్దన్నారు. ఇప్పటి వరకు బ్యాంకులో ఖాతా తీసుకోని వారుంటే వెంటనే బ్యాంకు ఖాతా తీసుకుని సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీజీబీ బ్రాంచ్ మేనేజర్ భూమరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ నవీన్, సిబ్బంది రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పటిష్ట బందోబస్తును నిర్వహించాలి

భీమారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలో మూడవ విడతలో ఎన్నికలు ఉన్నందున మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం భీమారం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్ఐ శ్వేతను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం


మందమర్రిరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్తుమూర్తి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కుమరం భీం
జిల్లా వార్తలు
8
ఆదివారం 30 నవంబరు 2025



ఎవరి ఎ'జెండా' వారిదే..

- ఆసక్తికరంగా మారుతున్న పంచాయతీ పోరు
- సర్పంచ్ స్థానాల్లో పాగాకు పార్టీల తహతహ
- తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు వ్యూహాలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపైనే కాంగ్రెస్ ఆశలు
- బీసీ ఓట్లపై ప్రతిపక్షాల గురి
- 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మాట తప్పిందని ప్రచారం



బెజ్జూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీలో నిలిచే అభ్యర్థులు సొంత ఎజెండాకే మొగ్గు చూపుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారింది. పార్టీలకతీతంగా జరిగే పల్లె పోరులో పార్టీ జెండా ఎగురవేయాలని తహతహలాడుతున్నాయి. తమ పార్టీ మద్దతుదారులను బరిలో దించేందుకు గ్రామాల్లో నేతలు మంతనాలు జరుపుతున్నారు. ప్రజల్లో పలుకుబడి, ఆర్థిక సోమత ఉన్న అభ్యర్థుల కోసం వెతుకుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి నినాదంగా పల్లెల్లో పాగా వేసేందుకు అధికార కాంగ్రెస్ పావులు కదుపుతుండగా, బీసీ జెండానే ఎజెండాగా ప్రతిపక్షాలు పల్లె పోరులో కాంగ్రెస్‌ను ఢీకొనేందుకు సిద్ధమవుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, పార్టీ పునాదులను పటిష్ఠం చేసుకునే దిశగా అన్ని పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నాయి.

● పార్టీలకు అతీతంగా..

పంచాయతీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నారు. పార్టీ గుర్తులు, రాజకీయ హామీలు లేకుండా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. అయితే పల్లె పోరులో పైచేయి సాధించేందుకు ఆయా పార్టీల నేతలు తమ మద్దతు దారులను బరిలో దించుతున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 335గ్రామపంచాయతీలు, 2,874 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో జిల్లాలో మెజార్టీ స్థానాలను అప్పటి అధికార పార్టీ బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఏ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా గెలిచిన సర్పంచ్‌లు కూడా అభివృద్ధి కోసం గులాబీ కారెక్కారు. ప్రస్తుతం జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేరు. దీంతో మెజార్టీ స్థానాలు ఎలాగైనా హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలను అమలు చేస్తుంది. ఇప్పటికే పోటీ లేనిచోట్ల నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీగా ఉన్న దండె విఠల్ సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన వారే కావడంతో నియోజకవర్గంలో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నారు. పోటీ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో పోటీదారుల మధ్య రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ పదవి పోటీ నుంచి తప్పుకుంటే ఎంపీటీసీకి అవకాశం ఇస్తామని కొన్నిచోట్ల మామీలు ఇస్తున్నారు.

● ఎంతో కీలకం..

గ్రామపంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. బీఆర్‌ఎస్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న క్రమంలో జరుగుతున్న ఎన్ని కలు కావడంతో గెలుపు ఆ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. దీంతో మెజార్టీ స్థానాలను గెలవడం ఆ పార్టీకి సవాల్‌గా మారింది. బీఆర్‌ఎస్ కూడా గత వైభవాన్ని నిలుపుకునేందుకు పావులు కదుపుతు న్నాయి. 2023అసెంబ్లీ ఎన్నికల ఓటమి తరువాత వరుసగా వస్తున్న అన్ని ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొంది. నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉన్నా ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నారు. ఇక జిల్లాలో ఏకైక బీజేపి ఎమ్మెల్యేగా ఉన్న హరీశ్‌ బాబు కూడా తన నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

● బలమైన అభ్యర్థుల వేటలో..

మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థులకు దీటుగా బరిలో దించేందుకు బీఆర్‌ఎస్ కూడా ఆర్థికంగా బలమైన నేతలను, పార్టీకి నమ్మకంగా ఉన్నవారిని గుర్తించి బరిలో దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌లు వేర్వేరుగా తమతమ అభ్యర్థులను పోటీ చేయించేందుకు గట్టిగా పావులు కదుపు తున్నారు. అయితే బీఆర్‌ఎస్‌లో రెండు వర్గాల కారణంగా స్థానిక పోరులో ఫలితాలు ఏవిధంగా ఉంటా యోనని విశ్లేషకులు ఆసక్తిగా పరిశీలిస్తు న్నారు. అదిష్ఠానం ఇద్దరిని ఏ మేరకు బుజ్జగి స్తుందో చూడాలి మరి.

● బీజేపీ సైతం..

బీజేపీ స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉంది. జిల్లాలో ఆ పార్టీ నుంచి ఏకైక ఎమ్మెల్యేగా హరీశ్ బాబు ప్రాతినిత్యం వహిస్తున్నారు. నియోజకవర్గం లో స్థానిక పోరులో ఎలాగైనా పట్టునిలుపుకునేం దుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. పార్టీ బలంతో పాటు యువతను ఎక్కువగా ఆకర్షించేం దుకు ఎత్తులు వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ అండతో పాటు గ్రామాల అభివృద్ధికి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో వివరిస్తూ నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తుంది.

● అధికారంలోకి వచ్చి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికలు కావ డంతో ఆ పార్టీ ప్రజా తీర్పును తమకు అను కూలంగా వచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు గ్యాస్ సబ్సిడీ, 200యూనిట్ల ఫ్రీ విద్యుత్తు, తదితర సంక్షేమ పథ కాలతో తమను ప్రజలు ఆదరిస్తారని ఆశతో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు. సన్న బియ్యం, సన్న వడ్లకు రూ.500సబ్సిడీ కూడా ఓట్లు రాలు స్తాయని ధీమాతో కాంగ్రెస్ ఉంది. ఇక ప్రతిపక్షాలు బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ముగిసిన తొలి విడత నామినేషన్లు

సర్పంచ్ స్థానాలకు 450. వార్డు స్థానాలకు 1,800 నామినేషన్లు

ఆసిఫాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో శనివారం తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మొదటి విడతలో జిల్లాలోని వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని 114 సర్పంచ్ స్థానాలకు, 944 వార్డు స్థానాలకు నామినేషన్లను స్వీకరించారు. సర్పంచ్ స్థానాలకు మొత్తం 450, వార్డు స్థానాలకు మొత్తం 1,800 నామినేషన్లు దాఖలయ్యాయి. దాఖలైన నామినేషన్లను ఆదివారం అధికారులు పరిశీలించనున్నారు. డిసెంబరు 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా డిసెంబరు 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అయా మండలాల పరిధిలోని సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నారు.

కంచన్‌పల్లి పంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవం



కనక పార్వతీబాయి

లింగాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండలం లోని కంచన్‌పల్లీ గ్రామ పంచాయతీ ఎకగ్రీవమైంది. ఈ గ్రామపంచాయతీ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించారు. పంచాయతీలో ఎనిమిది వార్డులు ఉన్నాయి. గ్రామస్థులు చర్చించుకుని కనక పార్వతీబాయి అనే మహిళ చేత నామినేషన్ వేయించారు. ఒక్కటే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమైంది. కాగా: మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు ముగిశాయి. లింగాపూర్ మండలంలో మొత్తంలో 14 సర్పంచ్ స్థానాలకు శనివారం వరకు 70 మంది నామినేషన్‌లు దాఖలు అయినాయి, వార్డు స్థానాలు మొత్తం 112కు 157 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

'ప్రజావాణి' రద్దు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండో సాధారణ పంచాయతీ ఎన్నికలు-2025 దృష్ట్యా ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేశామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించే వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయంటూ విద్యార్థులు శుక్రవారం నిరసనకు దిగిన నేపథ్యంలో స్పందించిన విద్యాశాఖ వరంగల్ రీజినల్ డైరెక్టర్ కె సత్యనారాయణరెడ్డి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల హెచ్‌ఎం బి. నారాయణసింగ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశా రు. మధ్యాహ్న భోజన నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని తెలిపారు.

వర్క్‌షాప్‌ను కాపాడే బాధ్యత తీసుకుంటాం

రెబ్బెన, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో గల వర్క్‌షాప్‌ను మూసివేయడం జరుగుతుందని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని వర్క్‌షాప్‌ను కాపాడే బాధ్యత ఏఐటీయూసీదేనని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి అన్నారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు అసత్యప్ర చారాలను నమ్మవద్దని అన్నారు. ఇక్కడ పని చేసే ఇద్దరు ఫిట్టర్లను కైరిగూడ ఒపెన్ కాస్టుకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారని అన్నారు. త్వరలోనే వారు ఇక్క డికి తిరిగి వస్తారన్నారు. కార్మికులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని తెలిపారు. అసత్య ప్రచారం సరికాదని తెలిపారు. కార్యక్ర మంలో నాయకులు మొగిలి, కిరణ్‌బాబు, శ్రీనివాస్, అశోక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అవస్థలు



దీక్షా దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్‌ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్, కార్యకర్తలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. దీక్ష దివస్‌లో భాగంగా జిలాల్లో కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి అధ్యక్ష తన నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి ముఖ్య అతిథిగా ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ కూటమిల దోపిడీ పెత్తందార్ల కబంధహస్తాల నుంచి తెలంగాణ తల్లిని విడిపించాలని అన్నారు. కాంగ్రెస్ నాయకుల ఇసుక దందా కోసం 2023లో మేడిగడ్డ బ్యారేజ్ బాబులు పెట్టి పేల్చడానికి ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో పిల్లర్ కుంగిందని చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గం తనకుల వద్ద కూడా చెక్ డ్యాం పేల్చారని ఆరోపించారు. మేడిగడ్డ మరమ్మతులు లేక లక్ష మంది రైతులు ఇబ్బందులు పడుతుండగా తనకులతో వెయ్యి మంది రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలన పూర్తి అధ్వానంగా ఉందని అన్నారు. ఎంతో పోరాటం చేసి కేసీఆర్ తీసుకు వచ్చిన తెలంగాణలో తొమ్మిదేళ్ల కాలంలో మెడికల్ కళాశాలలు, వేయి గురుకులాలు, కొత్త జిల్లాలు, పేద విద్యార్థులకు హైదరాబాద్‌లో నాలుగు ప్రతిభ పాఠశాలు ఏర్పాటు చేశారని అన్నారు. దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌వనగా నిలిచిందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 115 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని తెలిపారు. దీన్ని కూడా కాంగ్రెస్ పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అలీబీన్ అహ్మద్, రవీందర్, సరస్వతీ, పోచయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, సంజీవ్, నిసార్, జీవన్, బాపురావు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిరావాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించడాన్ని నిరసిస్తూ ఆదివారం చేపట్టే బీసీల చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మారుతి, ప్రణయ్, రవికుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపాలిటీలోని వార్డు నంబరు 1 దస్నాపూర్, వార్డు నంబరు 8 టీఆర్‌నగర్, వార్డు నంబరు 6 బాపునగర్‌లో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంట్లోని చెత్తాచెదారం ఇంటి ముందుకు వచ్చే బండ్లలో మాత్రమే వేయాలని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామయ్య తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా కమిటీ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా పీడీఎస్‌యూ నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వంశీ, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, ఉపాధ్యక్షుడిగా అయూబఖాన్, సహాయ కార్యదర్శిగా నితిన్, కోశాధికారిగా రమేష్, సభ్యులు సమీర్, తరుణ్, దీపక్ నాయక్, మల్లేష్, రోహిత్, వసంత్‌లను ఎన్నుకున్నారు.

బారులు తీరిన అభ్యర్థులు



వాంకిడి నామినేషన్ కేంద్రం వద్ద వేచి ఉన్న అభ్యర్థులు

వాంకిడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలో నామినేషన్ల చివరి రోజు నామిషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు ఆయా కేంద్రాల వద్ద బారులు తీరారు. రాత్రి పది గం టల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో బందో బస్తు ఏర్పాటు చేశారు.

మతీన్ అహ్మద్ సేవలు అభినందనీయం



డీఈ మతీన్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ డీఈగా సేవలందించి పదవీ విరమణ పొందుతున్న సయ్యద్ మతీన్ అహ్మద్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కొనియాడారు. స్థానికంగా శనివారం ఆయనకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని డీఈ మతీన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మతీన్ మిషన్ భగీరథలో డీఈగా అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, సంజీవ్, అహ్మద్, నిసార్, శ్రీధర్‌రెడ్డి, ఇస్లాం, మహేష్, ఉబేద్ పాల్గొన్నారు.

శ్యాంనాయక్ తీరు సరికాదు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్యాంనాయక్‌ను ప్రజలు తిరస్కరించారని అది మరిచి పోయి నోటికి వచ్చినట్లు మాట్లాతుండడం సరికాదని కాంగ్రెస్ నాయకులు వసంత్‌రావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయ ఆవరణలో శనివారం మండలాధ్యక్షుడు చరణ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశానికి మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెరమెరిలో డీసీసీ అధ్యక్షురాలి సమక్షంలో శ్యాంనాయక్ మాజీ డీసీసీ విశ్వప్రసాద్‌పై మాట్లాడడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయం కావడంతో పార్టీని గెలిపించుకోవాల్సింది పోయి సొంత పార్టీ నాయకులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకుడు అనిల్‌గౌడతో పాటు ఆయన భార్యపై, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌పై చేసిన వ్యాఖ్యలు ఖండిసున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సలీం, రవీందర్, సాయి, కలీం, జావీద్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత నామినేషన్లకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడత సర్పంచ్, వార్డు స్థానాలకు ఆదివారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఈ ప్రక్రియ డిసెంబరు 2 వరకు కొనసాగనుంది. బెజ్జూరు మండలంలోని 22 పంచాయతీలు, 188 వార్డు స్థానాలు, దహెగాం మండలంలోని 24 పంచాయతీలు, 200 వార్డు స్థానాలు, చింతలమానేపల్లిలోని 19 పంచాయతీలు, 176 వార్డు స్థానాలు, కౌటాల మండలంలోని 20 పంచాయతీలు, 182 వార్డు స్థానాలు, పెంచికల్‌పేట మండలంలోని 12 పంచాయతీలు, 102 వార్డు స్థానాలు, సిర్పూర్(టి) మండలంలోని 16 పంచాయతీలు 144 వార్డు స్థానాలు ఉండగా మొత్తం 113 గ్రామ పంచాయతీలు, 992 వార్డు స్థానాలకు నామినేషన్లను స్వీకరించనున్నారు. డిసెంబరు 2 వరకు నామినేషన్లను స్వీకరించి 3న నామినేషన్లను పరిశీలించి 6న ఉపసంహరణకు గడువు విధించారు. డిసెంబరు 14న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అయా మండలాల పరిధి లోని సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

పెంచికలపేట/సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండలంలోని నామినేషన్‌ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సహాయ జిల్లాఎన్నికల అధికారి ఎంపీడీవో అల్బర్ట్ తెలిపారు. నామినేషన్‌ల స్వీకరణకు సంబంధించిన సామాగ్రిని రిటర్నింగ్ అధికారులకు అందించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాలలో నామినేషన్ స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ నెల 30 నుంచి డిసెంబరు 2 వరకు మూడు రోజుల పాటు నామినేషన్ స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సిర్పూర్(టి) మండలంలోని 16 గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల నామినేషన్ ప్రక్రియకు ఏర్పాటు పూర్తి అయినట్లు ఎంపీడీవో సత్యనారాయణ, ఈవో తిరుపతి తెలిపారు, మండల కేంద్రంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. నామినేషన్‌లు క్లస్టర్ల మాదిరిగా వేయాలని కోరారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు.